


# ఆనాటి అపురూప చిత్రాలు
## ఈనాటి సమగ్ర పరిచయాలు

- ప్రొ.డా.జ్ఞానేశ్వర రావు కె.వి.ఎస్



సినిమా రంగంలో విజయావారి బేనర్‌కి ఒక ప్రత్యేకతవుంది. వారు పక్కా సినిమా స్క్రిప్ట్ తయారుచేసుకునిగాని చిత్రీకరణ మొదలుపెట్టే ప్రశ్నే లేకుండా ప్రతి  సంవత్సరం సంక్రాంతి కానుకగా సినిమాలు రిలీజు చేసేవారు. భవిష్యత్తులో ఎదురులేని హీరో, హీరొయిన్లుగా ఎదిగినప్రముఖులు, లబ్ధప్రతిష్ఠులు తొలిరోజుల్లో నెలవారీ జీతాలతో 'ఇగో ప్రాబలమ్స్' తలెత్తకుండా దర్శక, నిర్మాతలకి లోబడి క్రమశిక్షణతో ఒకే త్రాటిపై నడిచి పనిచేసేవారు. సాంకేతికబృందం సరేసరి-అంతా కలిసి ఒకే కుటుంబంలా మసలుకునేవారు. అది సినిమాల స్వర్ణ యుగం. అందువల్ల సినిమాచూస్తున్నంతసేపూ వినోదంతోపాటు ప్రేక్షకులు ఆయా పాత్రలతో తాదాత్మ్యంచెంది సన్నివేశపరంగా ఆయా అనుభూతులను నవరసభరితంగా పంచుకోవడం జరిగేది. పాటలుగాని, నృత్యాలుగాని అశ్లీలం చోటుచేసుకోకుండా సందర్భానుసారంగా, సాంప్రదాయరీతిలో పాలల్లో నీళ్ళలాగా కలిసిపోయి ఆహ్లాదాన్ని కలిగించేవి.

హాస్యం పాత్రోచితంగా కథాస్రవంతిలో కలిసిపారేది. వాస్తవికత,నాటకీయత, కాల్పనికత,సృజనాత్మకత సమపాళ్ళలో రంగరించినట్లుగా పడుగుపేకగా సాగేవి. ఒక దృశ్యకావ్యాన్ని ఆవిష్కరించడంలో నటీనటులు పోటీపడి నటించడమేగాక డైరెక్టర్ నుండి లైట్‌బోయ్   వరకు కథాచర్చల్లో పాల్గొని శ్రద్ధాసక్తులు చూపేవారు. 'జనం కోరేది మనం చేయాలి' అనే సంకల్పంతో జనరంజకంగా వినోదాన్ని అందించేవారు. 'షావుకారు' మొదలుకొని 'బృందావనం' వరకు  ఎన్నో సినిమాలు తదుపరి చిత్రాలకు ఒరవడిగా , గీటురాళ్ళగా వెలిశాయి.(బ్లాక్ బస్టర్ క్లాసిక్స్‌తో పాటు కొన్ని ఫ్లాప్స్ కూడా జతగూడటం అనూహ్యం!)

అంతేకాక 'విజయా పతాక' సినిమాల్లోఎవరినీ నొప్పించకుండా సమకాలీన సాంఘిక సామాజిక సమస్యల ప్రస్తావన ఉండేది. పాటలు సందేశాత్మకంగా ఉండేవి. సంభాషణలు నిజజీవితానికి దర్పణం పట్టేవిగా మలచబడేవి. ఏ పాత్ర నిర్మాణంలోనూ అనౌచిత్యం కనిపించకపోగా, ఆ పాత్రలేనట్లు ఊహిస్తే లోటుగా,వెలితిగా, అసహజంగా అనిపించేది. ఆ 'జిగిబిగి' అంత పకడ్బందీగా ఉండేది. సంభాషణాచాతుర్యానికీ, చమత్కారాలకీ , సామెతలకీ, జాతీయాలకీ, లోకోక్తులకీ, నానుడులకీ కొదవలేదు. మాటలు,పాటలు సానబట్టిన చురకత్తుల్లా పదునుగా, మణిమాణిక్యాల్లా తళుక్కుమంటూ, కొత్త ఆవకాయఘాటులా చురుక్కుమంటూ, తేటతెనుగు తేనెలూరుతూ, భాషనేర్చేవాళ్ళకు  పాఠ్యగ్రంథాల్లా ఉండేవి. మచ్చుకి ఒక్క పొల్లుమాటకూడా కానరాకుండా ప్రసిద్ధరచయితలు శ్రద్ధ తీసుకునే వాళ్ళు. పాటలు రసగుళికలే! గాత్రశుద్ధిగల గాయనీ గాయకుల  గళాలనుండి జాలువారి అజరామరంగా ఆబాలగోపాలపు నాలుకలపై నర్తించేవి. కళ, ఫొటోగ్రఫీ, సినిమటోగ్రాఫీ బ్లాక్ అండ్ వైట్ రోజుల్లో కూడా అత్యున్నత ప్రమాణాల్లో అబ్బురపాటుగొలిపేవి. సాధారణ ప్రేక్షకుడిని కూడా సహజత్వంతో మొదలుపెట్టి, ఊహాలోకాల్లోకి తీసుకుపోయేవి.అంతర్లీనంగా సమాజానికి మేలుచేసే ఏదో ఒక సందేశం లేకుండా ఏ సినిమా ఉండేదికాదు.

# గుండమ్మ కథ - 2

(రాజా కారులో బయల్దేరి బంగళాకి వెళ్తాడు.)అక్కడ——

అన్న ఆంజనేయ ప్రసాద్: రా తమ్ముడూ. ఏమిటి విశేషాలు?

రాజా: ఏం లేదు. ఇవాళ సినిమా చూద్దామని!

ఆంజ: That's very good.

నౌకరు వెంకన్న వచ్చి: బాబూ.నాన్నగారు రమ్మంటున్నారు.

ఆంజ: ఎందుకు?

నౌకరు: ఏమో?

రాజా: ఈమధ్య నాన్న మనకి సంబంధాలు చూస్తున్నారు. బహుశా అందుకే అయ్యుంటుంది.

ఆంజ: That's very good. Come on. –ఇద్దరూ లేచి వెళతారు.

★★★

బంగళాలో కుర్చీలో కూర్చున్న జమీందారు రామభద్రయ్య వద్దకు అన్నదమ్ములిద్దరూ పోయి నిలబడి–

ఆంజ: ఎందుకు నాన్నా పిలిచారు?

రా.భ.: అదేరా. మీ పెళ్ళి విషయం. పెద్దపెద్ద కట్నాలిస్తామని ఎన్నో సంబంధాలు వస్తున్నాయి. కాని కట్నాలు పుచ్చుకోవడం నాకిష్టం లేదు.(ఆదర్శం) కట్నాలు తెచ్చే కోడళ్ళు డబ్బుతోపాటు అధికారగర్వంతో కూడా దిగుతారు. మనకి కావలసింది అటువంటివాళ్ళుకాదు. ఏదో సంసారపక్షంగా ఇల్లుదిద్దుకుని మన సుఖాలతోపాటు కష్టాలుకూడా పంచుకునే పిల్లలైతే చాలు.

రాజా: అలాగే. అట్లాంటి పిల్లల్నే చూడండి. (పెద్దలమాటమీద గౌరవం, సంప్రదాయబద్ధమైన విలువలు, వినయం,అణకువ గమనించండి. )

రా.భ: అదిచెబుదామనే పిలిచాను. ఇవాళ ఒక సంబంధం వచ్చింది. గుండుపోగుల వెంకట్రామయ్య–అని. చిన్నప్పుడు నాకు చాలా సహాయం చేశాడు. అప్పుడు మనం పేదవాళ్ళం. మీ అమ్మను నాకివ్వడానికి సందేహిస్తుంటే ఈ వెంకట్రమయ్య తండ్రే వాళ్ళకి నచ్చజెప్పి సంబంధం కుదిర్చాడు. మీ అమ్మ అదృష్టంవల్ల కలిసొచ్చింది. ఇంతవాళ్ళం అయ్యాం. (సెంటిమెంటు) ఇప్పుడు వెంకట్రామయ్య లేదు. అతని మొదటిభార్య ఉన్నన్నాళ్ళూ మనింటికి వస్తూపోతూ ఉండే వాళ్ళు. కాని ఆవిడపోయాక ఆ ఊరే వదిలి వెళ్ళిపోయాడు. మళ్ళీ మేము కలుసుకోనేలేదు. అతనికిప్పుడు పెళ్ళీడుకొచ్చిన పిల్లలిద్దరున్నారు.

ఆంజ: ఐతేపోయి చూసిరండి నాన్నగారూ. అక్కచెల్లెళ్ళయితే మరీ మంచిది. పదికాలాలపాటు కలిసీమెలిసీ ఉంటారు. ఏం తమ్ముడూ?

రాజా: కాదుమరీ? బయటవాళ్ళయితే వచ్చిన మర్నాడే పంపకాలూ, వేరుకూళ్ళూ అంటూ పేచీ పెట్టుకు కూర్చుంటారు.

రా.భ: నా ఉద్దేశం అదే. అందుకేగా ఇంతకాలం ఆగిందీ? సరే. నేవెళ్ళి చూసొస్తాను. రామభద్రయ్యలేచి చేతికర్ర అందుకోగా ఆంజనేయ ప్రసాద్ కండువాతీసి అందిస్తాడు.

★★★

గుండమ్మ కొడుకు బంధువుల అమ్మాయితో కలిసి పార్కులో విహరిస్తూవుంటాడు.

---గుండమ్మ ఇంట్లో——గంటన్న ఎదురుగా——

పెళ్ళిళ్ళ శాస్త్రులు: ఏముందీ? కట్నాలు,కానుకలు, ఇవ్వడాలు, పుచ్చుకోవడాలు అన్నీ వివరంగా చెప్పేశాను.

గం: మా చెల్లాయి సంగతి ఏమైనా అడిగారా?

శా: ఏమీ అడగలేదు. నేనే చెప్పేశాను.

గం: చెప్పేశారూ?

శా: ఆఁ. అందరిసంగతులూ వివరంగా చెప్పేశాను.

గం: నా సంగతికూడా?

శా:ఆఁ.

గుం: ఇంతకీ వారేమన్నారు?

శా: వారే స్వయంగావచ్చి పిల్లని చూసుకుంటామన్నారు.

గుం:ఆనందంగా– – ఆఁహాఁ. ఎప్పుడొస్తారో?

శా: వచ్చేటప్పుడు ఉత్తరం వ్రాయమన్నాను.

గం: మనం రాయమంటే రాస్తాడుటయ్యా? ఎప్పుడో అదాట్టున దిగుతాడు. మనకొంప మునుగుతుంది. ఛఛ! ఇదటయ్యా నిన్ను పంపితే నువ్వు చేసుకొచ్చిన నిర్వాకం?

శా: పోవయ్యా. ఆయన చెప్పినమాటే చెప్పాను. ఆయన అదాట్టుకొస్తే నీకెందుకు?

బిదాట్టుకొస్తే నీకెందుకు?వస్తానమ్మా. –కొడుకు అప్పుడే లోపలికి వస్తూ శాస్త్రులుకి ఎదురు పడతాడు.

గుం: ప్రభాకరం? ఇప్పటిదాకా ఎక్కడ తిరుగుతున్నావురా?

ప్ర: మా పంతులిగారి కాలు విరిగితే చూడ్డానికి వెళ్ళానమ్మా.

గం: మీ పంతులుగారికి కిందటిసారి కదా కాలు విరిగిందన్నావ్?

ప్ర–కోపంగా–– అప్పుడు బెణికిందిలెద్దూ. ఇప్పుడు విరిగింది. నీకు మహా తెలిసినట్లు చెపుతున్నావ్.– అక్కడినుండి నిష్క్రమిస్తాడు.

గం: నేను ఏమో అనుకున్నాను చెల్లాయ్! మనవాడు దారిలో పడుతున్నాడు. ఆలోచించకుండా అబద్ధం చెప్పేశాడు. పైకొచ్చే వేషాలు కనిపిస్తున్నాయ్! ( టీనేజర్ల ప్రవర్తన అప్పటికీ ఇప్పటికీ ఒక్కలాగేవుంది).

★★★

బంధువుల ఇంట్లో భోజనం ముగించి రామభద్రయ్య చేతులు తుడుచుకుంటూవచ్చి సోఫాలో కూర్చుంటాడు.

గృహిణి: ఈ సంవత్సరమే చేసేస్తారా అబ్బాయిల పెళ్ళిళ్ళు?

రా.భ: ఔనమ్మా. ఆ పనిమీదే ఇక్కడికి వచ్చాను.

గృహస్థు: ఈ ఊళ్ళోనా? ఎవరిపిల్లలు?

రా.భ: అదే. గుండమ్మని ఉన్నారుకదా?

గృహస్థు: ఆఁ. గుండమ్మ కూతుళ్ళా? అబ్బో. ఆమెని గురించి చాలా కథలున్నాయిలే.

రా.భ: తెలుసు. తెలుసుకునే వచ్చాను. చూద్దాం. చూద్దాం.

★★★

హొటల్లో—గంటన్న ప్రొప్రైటర్ టేబిలుపై న్యూస్ పేపరు తీసుకుని: రష్యాలో అరవై శేర్లు పాలిచ్చే ఆవు. అరవై శేర్లా!? ( లీటర్లు ఇంకా వాడుకలోకి రాలేదు) పేపరు పడేసి బైటికి వస్తాడు.

సర్వరు ఎదురుపడి : నమస్కారం సార్!

గం: నువ్వేమిట్రా ఇక్కడున్నావ్?

స: మీ దయవల్ల ప్రొప్రైటర్ నన్ను పనిలోంచి తీసేశాడుగా. ఎక్కడైనా పనుంటే ఇప్పించండీ.

గం: పనా? ఒరే. చేసేవాడికి బోలెడంత పనుందిరా. రా. –వాడిని తీసుకు పోతాడు.

★★★

అప్పుడే అటువస్తున్న రామభద్రయ్యకి గుండమ్మ ఇంటి ముంగిట గంటన్న, సర్వరు ఎదురుపడతారు.

సర్వరు: భలేవాడివిలేవయ్యా. వదలవయ్యా. ఈ ఇంట్లో ఎవడు పనిచేస్తాడు? (పరోక్షంగా గుండమ్మ గుణగణాల ప్రస్తావన)

గం: బాబ్బాబు. నాల్రోజులుండరా. ఈలోగా ఎవడినైనా పెట్టుకుంటాను.

స: నాల్రోజులు కాదుకదా నాలుగు నిమిషాలు కూడా వుండను. నువ్వే వుండు.

గంటన్న రామభద్రయ్యతో: చూడండి. పనులులేవని ఒకటే ఏడుపు. తీరా చూపిస్తే ఇదీ వీళ్ళ చదును.

రా.భ: గుండమ్మగారిల్లిదేనా?

గం: లేకపోతే వాడెందుకు పారిపోతాడు? ఇంతకీ తమరిది ఈవూరుకానట్టుంది?

రా.భ: కాదులెండి.

గం: తెలుస్తూనేవుందిలెండి. లేకపోతే ఈ వూళ్ళో ఈ ఇల్లు ఎరగని వాడెవడుంటాడు ?ఇంతకీ తమ వూరు?

రా.భ: వీరాపురం. నాపేరు రామభద్రయ్య.

గం–ఆశ్చర్యంగా– రామభద్రయ్యగారు తమరేనేమిటి? ఇంతకీ వచ్చేముందు ఉత్తరం రాస్తానన్నారటగా?

రా.భ: ఏదో తొందరలో వచ్చేశానులెండి.

గం: కాదులెండి. అనుభవజ్ఞులు. అదాట్టుగావస్తే అంతా బైట పడిపోతుందనీ. సరే వస్తే వచ్చేరు. నేనుండగానే వచ్చేరు. లేకపోతే కొంపమునిగిపోయేది.

రా.భ: ఆఁ. ఇంతకీ గుండమ్మగారికి మీరేమౌతారు?

గం:ఏమౌతాను? ఎగరేసి వదిలేస్తే రెండు చెక్కలౌతాను. వరసకి అన్నయ్యని. జీతంబత్తెం లేని గుమస్తాని.

రా.భ: ఇంతకీ మీ పేరేమిటి?

గం: కంచు గంటయ్య. ఇంటిపేరు కంచు. నాపేరు గంటయ్య.

రా.భ: గంటయ్యా?

గం: పేరేమిటని అలా చూస్తున్నారు? నా వెనకో పెద్ద గాథవుందిలెండి. మా అమ్మకి పిల్లలు పుట్టకపోతే ఆ పేరు పెట్టారు. ఆవిడ ధామ్మని చచ్చింది. నేనుమాత్రం బతికాను. రండిరండి——ఇంటిలోపలికి తీసుకుపోతాడు.

★★★

(సశేషం)

COMMENTS